టెట్‌పై ఆసక్తి అంతంతే

- మందకొడిగా దరఖాస్తులు
- ఇప్పటివరకు 44వేల అప్లికేషన్లు
- ఫీజు పెంపుతో దరఖాస్తుకు జంకుతున్న అభ్యర్థులు

హైదరాబాద్, ఏప్రిల్ 1 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)పై అభ్యర్థులు ఆసక్తి చూపడంలేదు. దరఖాస్తులు అంతంతమాత్రంగానే నమోదవుతున్నాయి. మార్చి 27 నుంచి టెట్ దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైనప్పటి నుంచి సోమవారం వరకు 43 వేల మంది మాత్రమే టెట్ దరఖాస్తులు సమర్పించారు. వీరిలో పేపర్ -1కు 15,768 మంది దరఖాస్తు చేయగా, పేపర్ -2కు 24,050 దరఖాస్తులు వచ్చాయి. ఈ రెండు పేపర్లకు హాజరయ్యేందుకు 4,173 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకొన్నారు. దీంతో మొత్తం 43,991 మంది అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేశారు. టెట్ దరఖాస్తుల గడువు ఈ నెల 10న ముగియనున్నది. గతంలో టెట్ నిర్వహించినప్పుడల్లా 4లక్షల మంది దరఖాస్తు చేసేవారు. వీరంతా నిరుద్యోగులే. అయితే ఈ ఏడాది సర్వీస్ టీచర్లు కూడా పదోన్నతుల కోసం టెట్‌కు హాజరవుతున్నారు. దీంతో టెట్‌కు భారీగా దరఖాస్తులొస్తాయన్న అంచనాలున్నాయి. దాదాపు 5 లక్షల వరకు దరఖాస్తులొస్తాయని అధికారులు ఆశించారు. కానీ అంతగా వచ్చే పరిస్థితి కనిపించడంలేదు. ఈ సారి టెట్ ఫీజును రూ. 400 నుంచి ఒక పేపర్‌కు వెయ్యి, రెండు పేపర్లకు రెండు వేలు పెంచారు. దీంతో నిరుద్యోగులు ఈ ఫీజులను చూసి దరఖాస్తు చేసేందుకు జంకుతున్నారు. ఆర్థికభారంతో చితికిపోయినవారంతా టెట్‌కు దరఖాస్తు చేసేందుకు ముందుకు రావడంలేదు. ఈ కారణంగానే దరఖాస్తుల సంఖ్య తగ్గాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో టెట్‌లో క్వాలిపై అయిన వారూ స్కోర్‌ను మెరుగుపర్చుకునేందుకు టెట్ పరీక్షరాసేవారు. టెట్ స్కోర్ వ్యవధిని జీవిత కాలం పొడగించడం, ఫీజులు భారీగా పెంచడంతో ఇక అవసరంలేదన్న భావనతో టెట్‌కు దూరంగా ఉంటున్నారు. మొత్తంమీద దరఖాస్తులు తగ్గేందుకు ఫీజుల పెంపుయే ప్రధాన కారణమని అభ్యర్థులు పేర్కొంటున్నారు.

టెట్ ఫీజు తగ్గించాలి

- దళిత, దివ్యాంగ అభ్యర్థులకు రాయితీ ఏదీ?
- ఇదేనా ఇందిరమ్మ రాజ్యం? ఇదేనా ప్రజా పాలన?
- మ్యానిఫెస్టోలోని హామీని కాంగ్రెస్ నిలబెట్టుకోవాలి
- లేదంటే నిరుద్యోగ అభ్యర్థుల తరపున పోరాడుతాం
- సీఎం రేవంత్‌కు మాజీ మంత్రి హరీశ్ రావు లేఖ

హైదరాబాద్, ఏప్రిల్ 1 (నమస్తే తెలంగాణ) : పెంచిన టెట్ ఫీజును వెంటనే తగ్గించాలని మాజీ మంత్రి టీ హరీశ్ రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. టెట్ ఫీజును భారీగా పెంచడం, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ విద్యార్థులకు ఇచ్చే రాయితీని విస్మరించడంపై నిరుద్యోగులను మోసం చేయడమేనని ఆ లేఖలో పేర్కొన్నారు. నిరుద్యోగ అభ్యర్థుల నుంచి అధిక ఫీజు వసూలు చేయడం బాధాకరమని, దీనిని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు స్పష్టంచేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో, టెట్ ఒక పేపర్ రాసినా, రెండు పేపర్లు రాసినా రూ.400 మాత్రమే ఫీజు తీసుకోగా, ఈ ఏడాది ఒక పేపర్‌కు రూ.1000, రెండు పేపర్లకు రూ.2000 ఫీజుగా వసూలు చేయడం అన్యాయమని పేర్కొన్నారు. ఈ ఫీజులు సీబీఎస్ఈ నిర్వహించే సీ టెట్‌తో పోల్చితే డబుల్‌గా ఉన్నాయని వివరించారు. రిజర్వుడ్ విద్యార్థులకు ఫీజు రాయితీ కల్పించకుండా జనరల్ క్యాటగిరీ విద్యార్థులతో సమానంగా ఒకే తరహా ఫీజులను అమలు చేయడం రాజ్యాంగ సూత్రాలకు విరుద్ధమని తెలిపారు. టెట్ ఫీజుల పెంపు, రిజర్వుడ్ విద్యార్థులకు ఫీజు రాయితీ కల్పించకపోవడాన్ని నిరసిస్తూ బీఈడీ, డీఎడ్ అభ్యర్థులు రాష్ట్ర వ్యాప్తంగా పోరాడుతున్నారని, పుస్తకాలు వదిలి రోడ్డెక్కి ఉద్యమిస్తున్నారని లేఖలో వివరించారు. అయినా ప్రభుత్వం నుండి కనీస స్పందన లేదని తెలిపారు. ఇదేనా ఇందిరమ్మ రాజ్యం? ఇదేనా మీ సోకాల్డ్ ప్రజా పాలన? అంటూ హరీశ్ రావు తన లేఖలో నిలదీశారు. నిరుద్యోగుల నుంచి రూపాయి ఫీజు తీసుకోకుండా దరఖాస్తులు స్వీకరిస్తామని, మ్యానిఫెస్టోలో ప్రకటించిన కాంగ్రెస్.. ఇప్పుడు ఫీజుల పేరుతో నిరుద్యోగుల నడ్డివిరిచడం ఏమిటని ప్రశ్నించారు.ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని, వెంటనే టెట్ ఫీజులు తగ్గించాలని బీఆర్ఎస్ పక్షాన ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం స్పందించకొంటే నిరుద్యోగుల తరపున పోరాడుతామని హెచ్చరించారు.

కరీంనగర్ జిల్లా గంగాధర మండలం కొండన్నపల్లి వద్ద వరదకాలువలో ప్రవహిస్తున్న నీరు

వరద కాలువకు 0.1 టీఎంసీ నీళ్లు

వారం వరకు సరిపోతాయి: అధికారులు

కరీంనగర్, ఏప్రిల్ 1 (నమస్తే తెలంగాణ)/ గంగాధర : రైతుల ఆందోళనల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం దిగొచ్చింది. ఆదివారం సాయంత్రం నుంచి అధికారులు వరద కాలువకు నీళ్లు వదులుతున్నారు. 0.1 టీఎంసీ నీటిని వదులుతున్నట్లు చెబుతున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి నీటిని తరలించకపోవడం, శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ద్వారా నీటిని విడుదల చేయకపోవడంతో పదేండ్లలో ఎన్నడూ లేని విధంగా వరద కాలువ అడుగంటింది. కాలువలో క్రేన్లు బిగించి రైతులు కాలువలో గుంతలు తవ్వుకుని నీటిని పంటలకు తరలించే ప్రయత్నాలు చేశారు. అయినా పంటలు ఎండిపోతున్న నేపథ్యంలో అనేక సార్లు ఆందోళనకు దిగారు. రైతులకు బీఆర్ఎస్ నాయకులు అండగా నిలవడంతో రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు నీటిని విడుదల చేసింది. ఇప్పటికే వేలాది ఎకరాల్లో పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఇవే నీటిని వారం పది రోజుల ముందు ఇచ్చినట్లయితే ఈ ప్రాంతంలో పంటలు ఎండిపోయేవి కాదని రైతులు అంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారులకు ఆదేశాలు ఇవ్వడంతో ఆదివారం సాయంత్రం నుంచి ఎల్లంపల్లి ప్రాజెక్టు ద్వారా ఎత్తిపోతలు ప్రారంభించారు. రామడుగు మండలం లక్ష్మీపూర్‌లోని గాయత్రీ పంప్‌హౌస్‌కు ఎత్తిపోయించారు. అక్కడి నుంచి 6వ బాహుబలి మోటర్ ద్వారా వరద కాలువలోకి ఎత్తిపోయిస్తున్నారు. వరద కాలువ ఎగువ ప్రాంతంలోని 122వ కిలో మీటర్ వద్ద గేట్లు మూయించడంతో అటు ఎస్సారెస్పీకి వెళ్లకుండా దిగువ ప్రాంతానికి నీటిని మళ్లించారు. సోమవారం రామడుగు మండలం షానగర్ వద్ద గేట్లు ఎత్తడంతో దిగువ ప్రాంతంలోని బోయినపల్లి మండలం వరదవెల్లి వరకు వరద కాలువలో నీళ్లు నిండుతున్నాయి. 0.1 టీఎంసీ నీటిని మాత్రమే విడుదల చేస్తున్న నేపథ్యంలో రైతులకు ఎంత వరకు ఉపయోగపడతాయనేది ప్రశ్నార్థకంగానే ఉన్నది.

ఉరికించిన కేసీఆర్.. ఉలిక్కిపడ్డ సర్కార్

మొదటిపేజీ తరువాయి...

బాహుబలి మోటర్ గర్జిస్తూ ఆన్ అయింది. లక్ష్మీపూర్ సర్జ్‌పూల్ నుంచి నీటి ఎత్తిపోత మొదలైంది. జల విస్ఫోటం జరిగినట్టు పంపులోంచి నీళ్లు గుమ్మటంలాగ ఎగిసిపడ్డాయి. ఎస్సారెస్పీ వరద కాల్వలోకి ఎగిరిదుంకాయి. ఉదయం 4 దాకా 12 గంటల పాటు మోటరు నడుస్తూనే ఉంది. 0.1 టీఎంసీ నీళ్లు కాల్వలోకి పరుగులు తీశాయి. భూగర్భ జలాలను పెంచి బోర్లను రీచార్జ్ చేసేందుకు ఉరకలెత్తాయి. తన తదుపరి పర్యటన ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనే అని కేసీఆర్ దాదాపు 6 గంటలకు సూర్యాపేటలో ప్రకటించిన ఫలితమిది.

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కేసీఆర్ పర్యటించిన దాదాపు 24 గంటల తర్వాత.. సోమవారం సాయంత్రం 6.15కు నాగార్జునసాగర్ ఎడమకాల్వ గేట్లు తెరుచుకున్నాయి. కేఆర్ఎంబీ ఏమైనా అడ్డా? వాళ్లను అడిగి నీళ్లు తీసుకోవాలా? మన రైతుల కోసం తీసుకుంటే వాళ్లు ఆపగలరా? అని కేసీఆర్ గర్జించడంతోనే, గేట్లు తెరుచుకోవడమే కాదు; దాదాపు వెయ్యి క్యూసెక్కుల నీళ్లు కాల్వలోకి మళ్లాయి. అర్ధరాత్రికి దాదాపు 2500 క్యూసెక్కుల నీళ్లు ప్రవహించినట్టు ఒక అంచనా. సాగర్ ఆయకట్టులో బోర్లలో నీళ్లు లేక బోరుమంటున్న, బోర్ల మీద బోర్లు వేసి అతలాకుతలమవుతున్న రైతులకు ఇది పెద్ద ఊరట.

''మరి నిన్నటిదాకా లేవన్న నీళ్లు కేసీఆర్ కాలు బయటపెట్టంగనే ఎట్ల వచ్చినయ్? కేసీఆర్ నిలదీయంగనే కాల్వలకు ఉరికి ఎట్ల పారినయ్?'' ఇదీ రైతులు వేస్తున్న ప్రశ్న. ''వరద కాల్వలోకి నీళ్లు వదలండి. లెఫ్ట్ కెనాల్‌కు నీళ్లు ఇవ్వండి. దీనివల్ల భూగర్భం రీచార్జ్ అవుతుంది. కనీసం బోర్లతోనైన పంటలు పండించుకుంటం.. అని నిన్నటిదాకా ప్రభుత్వాన్ని, అధికారులను వేడుకున్నం. ధర్నాలు చేసినం. అయినా ఎవరూ పట్టించుకోలేదు. కేసీఆర్ కాలు బయటపెడితే తప్ప మా గోడు ఎవరూ విన్లేదు. ఇదే పని ముందు చేసి ఉంటే మా పంటలు ఎండకనే పోవు కదా'' అని ఎస్సారెస్పీ వరద కాల్వ, సాగర్ ఎడమ కాల్వ కింది రైతులు వాపోయారు. కాళేశ్వరం ప్రాజెక్టంటే మేడిగడ్డ లక్ష్మీ బరాజ్‌లో కుంగిన మూడు పిల్లర్లు కాదు. అది గొలుసుకట్టు ప్రాజెక్టు. దాన్ని వాడుకుంటే బాగుంటదని నిపుణులు నెత్తినోరు కొట్టుకున్నా ప్రభుత్వం వినలేదు. ''నిన్న కేసీఆర్ గర్జించగానే కాళేశ్వరం బాహుబలి మోటర్లు ప్రారంభమయ్యాయి. మరి పనికిరాదన్న కాళేశ్వరం ఇప్పుడెట్ల పనికొచ్చింది? ఈ విషయాన్ని ఒప్పుకోవడానికి ప్రభుత్వానికి నామోషీ ఎందుకు? ఇదే పద్ధతిలో ప్రాణహితలో వృథాగా పోతున్న నీటిని, దేవాదుల వద్ద ప్రవాహాన్ని ఒడిసిపడితే ఏం నష్టం'' అని కూడా రైతులు ప్రశ్నిస్తున్నారు. మొత్తమ్మీద, రాజకీయం కోసం కాదు; రైతుల కోసం అంటూ కేసీఆర్ చేసిన పర్యటనతో, హెచ్చరికతో ప్రభుత్వం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఫేకులు, లీకులతో మసిబూసి మారేడుకాయ చేయవచ్చన్న ప్రయత్నం బెడిసి కొడుతున్నదన్న సంగతి దానికి అర్థమైంది. అందుకే అనివార్య పరిస్థితిలో కాళేశ్వరం పంపుల్ని అది ఆన్ చేయక తప్పలేదన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతున్నది. కేసీఆర్ చెప్పేదాకా చేయకపోవడం ప్రభుత్వంలో ఉన్న అవగాహన లేమిని పట్టిచెప్పింది. కేసీఆర్ రైతు ఉద్యమంతో ప్రభుత్వం ఎంత బెదిరిపోయిందంటే, ఆదివారం సూర్యాపేటలో ఆయన ప్రెస్‌కాన్ఫరెన్స్ ముగియగానే వ్యవసాయ మంత్రి తుమ్మల ఒక ప్రకటన విడుదల చేశారు. ఇక సోమవారమైతే కేసీఆర్ ఎఫెక్ట్‌ను ఖండించడానికి మంత్రులు, కాంగ్రెస్ నేతలు పోటీలు పడి ఎక్కడికక్కడ విలేకరుల సమావేశాలు నిర్వహించారు. కరువు విపరిణామాలపై, ఎండుతున్న పంటలపై ఇప్పటిదాకా పెద్దగా దృష్టిపెట్టని సాగునీటి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సోమవారం మధ్యాహ్నం ఏకంగా సమీక్షా సమావేశమే నిర్వహించారు. ఇక ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హైదరాబాద్‌లో, మంత్రి పొన్నం ప్రభాకర్ కోహెడలో, మంత్రి కొండా సురేఖ వరంగల్‌లో, మంత్రి శ్రీధర్‌బాబు పెద్దపల్లిలో, మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఖమ్మంలో, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కరీంనగర్‌లో, వేముల వీరేశం నల్లగొండలో విలేకరుల సమావేశాలు నిర్వహించి కేసీఆర్ మాటల్ని ఖండించడానికి ప్రయత్నించారు. కాంగ్రెస్ నేతలు మాటల్లో ఏమి చెప్పినా, సర్కారు చేతలు మాత్రం కేసీఆర్ ఎఫెక్ట్‌ను చెప్పకనే చెప్పాయని రాజకీయ పరిశీలకులు పేర్కొంటున్నారు. ''కేసీఆర్ రైతుల దగ్గరకు వెళ్లే ఏమవుతుందోనన్న భయం కాంగ్రెస్ వారిలో కన్పించింది. అంతే తప్ప రైతుల పట్ల వారి చిత్తశుద్ధి కాదు. రైతుల పట్ల, రాష్ట్ర ప్రజల పట్ల వారికి నిజంగా ప్రేమ ఉంటే గోదావరి (ప్రాణహిత)లో వృథాగా పోతున్న నీటిని ఇప్పటికైనా ఒడిసిపట్టి ఎత్తిపోయాలి'' అని ఒక సీనియర్ పాత్రికేయుడు సూచించారు. ఇక నీళ్లు రావని, పంటలు ఎండిపోవడం తప్ప మరోమార్గం లేక దేవుడి మీదే భారం వేసిన రైతులు నీటి విడుదలతో కాస్త ఊపిరి తీసుకుంటున్నారు. ఇది కచ్చితంగా కేసీఆర్ విజయమేనని రైతులు స్పష్టం చేస్తున్నారు. ప్రభుత్వం మొద్దనిద్ద నటిస్తుంటే కేసీఆర్ పర్యటించడం, ఆయన ప్రభుత్వ అసమర్థతను ఎత్తిచూపడంతో వ్యవస్థలో చలనం వచ్చినట్టు చెప్తున్నారు. అందుకే రెండు కాలువలకు ఒకే రోజు నీటిని విడుదల చేస్తున్నారని అన్నారు. మరోవైపు, ఉన్నమాట అంటే ఉలుకెక్కువ అన్నట్టుగా కేసీఆర్ తన పర్యటనలో భాగంగా చేసిన విమర్శలు, ఎత్తిచూపిన వ్యవస్థాగత లోపాలతో ప్రభుత్వం ఉలిక్కిపడింది. ఇది కాలం తెచ్చిన కరువు కాదు అని కాంగ్రెస్ అసమర్థ పాలనా విధానం వల్ల తెచ్చిన కరువు అని కేసీఆర్ స్పష్టంగా, లెక్కలు, ఉదాహరణలతో సహా వివరించిన సంగతి తెలిసిందే. ఇంకోవైపు, కేసీఆర్ పర్యటనతో బీజేపీలోనూ చలనం వచ్చింది. ఇన్నాళ్లూ రైతులను పట్టించుకోని, కనీసం నీళ్ల గురించి ఒక్కమాట కూడా మాట్లాడని నేతలు ఇప్పుడు దీక్షలకు ఉపక్రమించారు. 5న రైతు జాగరణ పేరుతో కార్యక్రమం నిర్వహించనున్నట్టు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి ప్రకటించారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ మంగళవారం కరీంనగర్‌లో రైతు దీక్ష పేరుతో ఓ కార్యక్రమం చేపడుతున్నట్టు ప్రకటించారు. ఇప్పటి వరకు నీళ్లు విడుదల చేయాలని డిమాండ్ చేయకుండా, ఎండిన పంటలను పరిశీలించకుండా అకస్మాత్తుగా ఇప్పుడెందుకు రైతులపై ప్రేమ పుట్టుకొచ్చిందని ప్రశ్నిస్తున్నారు. కేసీఆర్ పర్యటనతో క్షేత్ర స్థాయిలో ఉన్న వాస్తవ పరిస్థితులు ప్రజలకు అర్థమయ్యాయని, అందుకే తాము కూడా పోరాటం చేస్తున్నామని చెప్పుకునేందుకే బీజేపీ నాటకాలకు తెరలేపిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రోడ్డెక్కినా పట్టించుకోలేదు

ఎస్సారెస్పీ శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి శ్రీ రాజరాజేశ్వర (మిడ్‌మానేరు) జలాశయం వరకు వరదకాలువ 122 కిలోమీటర్ల పొడవు ఉన్నది. ఈ కాలువ పొడవునా 34 తూములు, 60 చెరువులున్నాయి. ఆ చెరువుల పరిధిలో 8 నుంచి 9వేల ఎకరాల ఆయకట్టు ఉన్నది. కాలువ పొడవునా ఉమ్మడి కరీంనగర్, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలకు చెందిన వేలాది మంది రైతులు నేరుగా మోటార్లు పెట్టి సాగు చేసుకుంటున్నారు. కాళేశ్వరం ప్రారంభించిన నాటి నుంచి ఆ ఆయకట్టుకు లక్ష్యానికి అనుగుణంగా గత ప్రభుత్వం నీరందించింది. వరద కాలువను జీవనదిలా తీర్చిదిద్దింది. కానీ ఈ ఏడాది కాంగ్రెస్ ప్రభుత్వం వరద కాలువను పట్టించుకున్నది లేదు. నీళ్లు లేవంటూ వరద కాలువకు నీటిని విడుదల చేయలేదు. ఫలితంగా దానిపై ఆధారపడిన వేలాది ఎకరాలు ఎండిపోయాయి. ఈ నేపథ్యంలోనే వరద కాలువకు నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు ఎక్కడికక్కడ ధర్నాలకు దిగుతున్నారు. ఇటీవల కరీంనగర్ జిల్లా గంగాధర మండలం కురిక్యాల వద్ద, కొండన్నపల్లి వరదకాలువ వద్ద జగిత్యాల-కరీంనగర్ జాతీయ రహదారిపై రైతులు ఆందోళనలు చేపట్టారు. అయినప్పటికీ నీళ్లు లేవంటే లేవని అధికారులు తేల్చిచెప్పారు. ప్రభుత్వం సైతం పట్టించుకున్నది లేదు.

ఇప్పటికీ సర్కారుది అవగాహన రాహిత్యమే

నీటి యాజమాన్యంపై రాష్ట్ర సర్కారు ఇప్పటికీ ఒక అవగాహనకు రాలేదని, ఆకళింపు చేసుకోలేదని తెలిసిపోతున్నది. సాగునీటి విడుదల ఎలా చేయాలి? ఏం చేయాలి? అనేది ప్రభుత్వానికి అంతుబట్టడం లేదనేది సుస్పష్టంగా అర్థమవుతున్నది. అందుకు సుందిళ్ల బరాజ్ నిదర్శనంగా నిలుస్తున్నది. ఎన్‌డీఎస్ఏ ఆదేశాల సాకుతో, అవగాహన రాహిత్యంతో ఇప్పటికే అన్నారం బరాజ్‌ను ప్రభుత్వం ఖాళీ చేసింది. ఇప్పుడు అదే సాకుతో సుందిళ్ల బరాజ్‌ను కూడా ఖాళీ చేసేందుకు పూనుకున్నది. బరాజ్‌లో దాదాపు 2 టీఎంసీల మేర నీరు ఉన్నది. బరాజ్‌లో నీటిని నిల్వ చేయవద్దని గత అక్టోబర్‌లో ఎన్‌డీఎస్ఏ సూచించిన విషయం తెలిసిందే. ఇప్పటి వరకు ఆ నీటిని అలాగే ఉంచింది. సుందిళ్ల బరాజ్‌లో నీటిని విడుదల చేయాలని ఇటీవల అధికారులను ఆదేశించింది. ఆ మేరకు అధికారులు చర్యలు చేపట్టగానే స్థానిక రైతులు వచ్చి అధికారులను నిలదీశారు. ప్రాజెక్టులో నీరు ఉండడం వల్లే భూగర్భజలాలు ఉండి బోర్లు పోస్తున్నాయని, నీటిని దిగువకు విడుదల చేస్తే బోర్లు ఎండి పంట చేతికి రాకుండా పోతుందని పట్టుబట్టారు. దీంతో అధికారులు వెంటనే మళ్లీ నీటివిడుదలను నిలిపేశారు. ఈ ఒక్క సంఘటనతోనే రైతుకున్న సోయి కూడా ప్రభుత్వానికి లేదని అర్థమవుతున్నది. బరాజ్ నుంచి నీటిని దిగువకు విడుదల చేస్తే అది గోదావరిలోనే కలిసిపోతుంది, ఎవరికీ ప్రయోజనం లేదనేది అందరికీ తెలుసు. బరాజ్‌లో ఉంటేకనీసం పరిసర ప్రాంతాల్లోనైనా భూగర్భజలాలు ఉంటాయి. ఇదేమీ పట్టించుకోకుండానే నీటి విడుదలకు ప్రభుత్వం ఉపక్రమించడం దాని అవగాహన రాహిత్యానికి నిదర్శనం.

సాగర్ ఎడమ కాల్వకు నీటి విడుదల

నందికొండ, ఏప్రిల్ 1 : నాగార్జునసాగర్ ఎడమ కాల్వకు తాగునీటి అవసరాల కోసం సోమవారం ఎన్నెస్పీ అధికారులు 1,000 క్యూసెక్కులతో నీటి విడుదలను ప్రారంభించారు. ఎడమ కాల్వ పరిధిలో తాగునీటి కోసం రోజుకు 2,500 క్యూసెక్కులతో నీటినివిడుదలను కొనసాగించనున్నట్టు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశానుసారం నీటి విడుదల కొనసాగుతుందని వారు పేర్కొన్నారు.

గోదావరిలో నీరు లేక
నిలిచిన దేవాదుల మోటార్లు

ములుగు, ఏప్రిల్ 1 (నమస్తేతెలంగాణ) : తెలంగాణ జీవధార గోదావరి నదిలో ఎన్నడూ లేని విధంగా నీటిమట్టం తగ్గిపోవడంతో జే చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల పథకం పంపుహౌస్ వద్ద మోటార్లు నిలిచిపోయాయి. ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టులో కొన్ని రోజులుగా ఐదు మోటర్లతో గోదావరి నీటిని ఎగువ ప్రాంతాలకు పంపింగ్ చేస్తుండగా ఆదివారం సాయంత్రం మోటర్లన్నింటినీ నిలిపివేసినట్లు నీటి పారుదల శాఖ అధికారులు వెల్లడించారు. దేవాదుల పంపుహౌస్‌లో మోటార్ల కోసం తగిన నీటి మట్టాన్ని అందించేందుకు సమ్మక్క బరాజ్ నిర్మాణం చేపట్టగా సోమవారం నాటికి గోదావరి నీటి మట్టం 74.7మీటర్ల దిగువకు చేరింది. గతేడాది ఇదే నెలలో నీటితో కళకళలాడిన బరాజ్ వద్ద గోదావరి నది ప్రస్తుతం ఎండిపోయి కనిపిస్తున్నది.

ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం సమ్మక్క బరాజ్ వద్ద తగ్గిన నీటి ప్రవాహం

వనపర్తి జిల్లా పెబ్బేరు వ్యవసాయ మార్కెట్ యార్డు గోదాంలో ఎగిసిపడుతున్న అగ్ని కీలలు

పెబ్బేరు మార్కెట్ యార్డులో భారీ అగ్నిప్రమాదం

పెబ్బేరు, ఏప్రిల్ 1 : వనపర్తి జిల్లా పెబ్బేరు వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకున్నది. ఐదు వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాంలో పౌరసరఫరాల శాఖ 1,280 లక్షల గన్నీ బస్తాలను నిల్వ ఉంచగా.. మొదట వాటికే నిప్పంటుకున్నది. ఈ ప్రమాదంలో బస్తాలన్నీ కాలి బూడిదయ్యాయి. వీటి విలువ రూ.10 కోట్ల వరకు ఉంటుందని అధికారుల అంచనా. ప్రమాదం ఎలా సంభవించిందో నిర్ధారణ కానప్పటికీ.. మూడు ఫైర్ ఇంజన్లు, మున్సిపాలిటీ ట్యాంకర్లు గంటల కొద్దీ శ్రమించినా రాత్రి వరకు కూడా మంటలు అదుపులోకి రాలేదు. అలాగే కొంతమేర ధాన్యం కాలిపోయాయి. వీటి నష్టాన్ని ఇంకా అంచనా వేయలేదు. గోదాం కూడా చాలా వరకు ధ్వంసం కాగా, దాని విలువపై కూడా స్పష్టత రాలేదు. ప్రమాద తీవ్రతను తగ్గించేందుకు జేసీబీలతో గోదాం గోడలను పగుల గొట్టాల్సి వచ్చింది. కొందరు ట్యాంకర్ల యజమానులు స్వచ్ఛందంగా నీటిని తెచ్చి ఫైర్ ఇంజన్లలో పోశారు.

రాధాకిషన్‌రావును 10 రోజులు అప్పగించాలి

పోలీసుల కస్టడీ పిటిషన్

నాంపల్లి కోర్టులు, ఏప్రిల్ 1 (నమస్తే తెలంగాణ): ఫోన్ల ట్యాపింగ్ వ్యవహారంలో అరెస్టయిన మాజీ డీసీపీ రాధాకిషన్‌ను 10 రోజులపాటు తమ కస్టడీకి అప్పగించాలని కోరుతూ పోలీసులు సోమవారం నాంపల్లిలోని 14వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్‌పై విచారణ చేపట్టిన మేజిస్ట్రేట్ కన్నయ్యలాల్.. కౌంటర్ దాఖలు చేయాలని రాధాకిషన్‌రావు తరపు న్యాయవాదిని ఆదేశించారు. తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేశారు. మరోవైపు ఫోన్ల ట్యాపింగ్ కేసుకు టెలిగ్రాఫ్ చట్టంలోని సెక్షన్లను జోడించేందుకు అధికారులు హైకోర్టును ఆశ్రయించారు. ప్రణీత్‌రావు, భుజంగరావు, తిరుపతన్న కలిసి ఫోన్లను ట్యాప్ చేసినట్టు తేలిందని, దీనిపై ఆరా తీయాల్సి ఉన్నదని తెలిపారు. కాగా, భుజంగరావు, తిరుపతన్నల కస్టడీ మంగళవారంతో ముగియనున్నది.

7149 ధాన్యం కొనుగోలు కేంద్రాలు

- 'మద్దతు' కంటే తక్కువకు కొంటే చర్యలు: సీఎస్ శాంతికుమారి

హైదరాబాద్, ఏప్రిల్ 1 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో యాసంగి ధాన్యం కొనుగోలుకు 7149 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని, మరో నాలుగైదు రోజుల్లో ఇవి ప్రారంభమవుతాయని సీఎస్ శాంతి కుమారి తెలిపారు. తాగునీటి సరఫరా, అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యలు, పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, ధాన్యం కొనుగోలు అంశాలపై జిల్లా కలెక్టర్లతో సోమవారం సీఎస్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటికే ప్రారంభమైన కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోళ్లు ముమ్మరంగా సాగుతున్నాయన్నారు. మద్దతు ధరకంటే తక్కువకు కొనుగోలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల నేపథ్యంలో శంషాబాద్, బేగంపేట ఎయిర్‌పోర్టుల్లో తనిఖీలు నిర్వహించాలని శాంతికుమారి ఆదేశించారు. కోడ్ అమలుపై ఆమె సచివాలయంలో సమీక్షించారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలు చేయాలని స్పష్టం చేశారు.

కెరీర్ గైడెన్స్‌కు డయల్ 1800-425-2428

అందుబాటులోకి తెచ్చిన విద్యాశాఖ

విద్యార్థుల సందేహాలను తీర్చే టోల్‌ఫ్రీ నంబర్

ఈ సమాచారం పూర్తి ఉచితం

- కోర్సులు, కెరీర్
- ఉచిత విద్యనందించే సంస్థల వివరాలు
- అడ్మిషన్స్, కౌన్సెలింగ్
- కాలేజీలు, వర్సిటీల
- ప్రవేశ పరీక్షలు.. వాటి షెడ్యూళ్లు
- స్కాలర్‌షిప్స్
- హాస్టల్ వసతి

హైదరాబాద్, ఏప్రిల్ 1 (నమస్తే తెలంగాణ) : ఎస్సెస్సీ వార్షిక పరీక్షలు ముగిశాయి. విద్యార్థులు ఇప్పుడిప్పుడే భవిష్యత్తుపై ప్రణాళికలు వేసుకొంటున్నారు. స్కూల్ దశ పూర్తిచేసిన తర్వాత ఏం చేయాలి.. ఏం చదువాలన్నది ప్రతి విద్యార్థికి ప్రశ్నార్థకమే. ఎస్సెస్సీ తర్వాత ఏం చదవాలి. ఏ ఎంట్రెన్స్ టెస్ట్ రాయాలి. ఎలాంటి స్కాలర్‌షిప్స్ అందుబాటులో ఉంటాయి. ఎలాంటి కోర్సు చదివితే కెరీర్ బాగుంటుంది అన్నది ప్రతీ విద్యార్థి ఎదుర్కొనే ప్రధాన సమస్య. ముఖ్యంగా సర్కారు బడుల్లో చదివేవారు గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు ఇలాంటి సమస్యలతో సతమతమవుతారు. ఇలాంటి విద్యార్థుల సమస్యలను, సందేహాలను తీర్చేందుకు పాఠశాల విద్యాశాఖ చర్యలు చేపట్టింది. 'తెలంగాణ కెరీర్ గైడెన్స్' టోల్ ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తెచ్చింది. విద్యార్థులు 1800-425-2428 నంబర్‌ను సంప్రదిస్తే ఉచితంగా సేవలు పొందవచ్చు. ఈ హెల్ప్‌లైన్‌ను 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు చదువుకొంటున్న విద్యార్థుల కొరకు రూపొందించారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సోమవారం నుంచి శనివారం వరకు మాత్రమే ఈ సేవలు అందుబాటుల